క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి ఎమ్మెల్సీ సహకారం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్ కాలనీలో ఉన్న శ్రీవీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.50వేల విరాళాన్ని ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భగవంత్‌గౌడ్, సురేందర్‌గౌడ్, సెమదీప్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేశంపేట: మండలంలో వివిధ గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్ తెలిపారు. ఉదయం బైర్కాన్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, కొత్తపేటలో పాఠశాల అదనపు గదుల నిర్మాణం, నిర్దవెల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం తదితర వాటికి భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



అజీజ్‌నగర్ జెడ్పీ పాఠశాలలో పోటీలు

మొయినాబాద్‌రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులను ఉత్తేజ పరిచేందుకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, క్యారమ్స్, పరుగు పందేలు, జంపింగ్ తదితర పోటీలను శుక్రవారం ప్రారంభించారు. గెలుపే లక్ష్యంగా విద్యార్థులు తలపడుతూ చురుగ్గా పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు




కొందుర్గులో మాట్లాడుతున్న ఎంపీఓ లాలయ్య

కొందుర్గు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీఓ లాలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే ఇందరిమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు ప్రతి పేద కుటుంబానికి అందుతాయన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబయ్య, నాయకులు యాదయ్య, రాజేష్ పటేల్, ఏడీ రాజారత్నం, ఏఓ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేవెళ్ల: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువకులు అతివేగంగా వాహనాలు నడపొద్దని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- ఆగిన రిటేయినింగ్ వాల్ నిర్మాణ పనులు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణ పనులతో వాహనదారులు విసుగెత్తిపోతున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై నిర్మిస్తున్న రిటేయినింగ్ వాల్ పనుల్లో జాప్యం ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం ట్రాఫిక్‌జాం, దుమ్ము, ధూళితో నరకప్రాయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు.



బ్రిడ్జిపైన రిటేయినింగ్ వాల్ పనులు, చిత్రంలో హెచ్చరిక బోర్డులు



అసంపూర్తిగా రిటేయినింగ్ వాల్

శంకర్‌పల్లి: షాద్‌నగర్–కంది రహదారి 100 ఫీట్ల వెడల్పుతో శంకర్‌పల్లి మండలం, పట్టణం గుండా వెళ్తుంది. ఈ రహదారి సుమారు 86 కిలోమీటర్ల మేర ఉంది. అయితే శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద రిటేయినింగ్ వాల్, పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తొలుత చేపట్టలేదు. దీంతో రోడ్డు వేసిన మూడేళ్ల తర్వాత ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. వాహనదారుల ఇబ్బందులు గుర్తించినా అధికారులు పనులకు సంబంధించి అంచనా వేయగా.. ప్రభుత్వం ఆరు నెలల క్రితం రూ.11.02కోట్లు మంజూరు చేసింది. సదరు గుత్తేదారుకి పనులు అప్పగించినా ఆర్‌అండ్‌బీ అధికారులు మొదట బ్రిడ్జి కింద, పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అనంతరం బ్రిడ్జి పైన రిటేయినింగ్ వాల్ పనులు ప్రారంభించారు.

ఎదురవుతున్న సవాళ్లు

బ్రిడ్జికి ఆనుకోని రిటేయినింగ్ వాల్ నిర్మించేందుకు గాను అర్‌అండ్‌బీ అధికారులకు, సదరు గుత్తేదారుకి సవాళ్లు ఎదురయ్యాయి. ఆ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళ్లడం, దానికి తోడు వర్షం పడడం ఆటంకంగా మారింది. దీంతో నిత్యం భారీ ఎత్తున ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. అర్‌అండ్‌బీ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సహాయంతో పనులను చేపట్టారు. రిటేయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన కొద్దీ భూమి కుంగిపోవడం, వర్షం కారణంగా వాల్ కూలిపోవడం వంటివి చోటు చేసుకున్నాయి. రెండు నెలల క్రితమే సగం పనులు పూర్తి చేసిన అధికారులు మిగిలిన సగం పనులనే అలానే వదిలేశారు. అరకొర పనుల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

నిత్యం ట్రాఫిక్ జామ్

షాద్‌నగర్–కంది రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ముఖ్యంగా సరుకు రవాణా చేసే లారీలు షాద్‌నగర్ వైపు నుంచి కంది, సంగారెడ్డి మీదుగా ముంబయి వెళ్తుంటాయి. అదే కాకుండా షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, నవాబుపేట, తదితర మండలాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ఈ రహదారిపైనే ఎక్కువ ఆధార పడతారు. రిటేయినింగ్ వాల్ పనులు సగం వరకు పూర్తి కావడం.. మిగిలిన రోడ్డుపైన పనులు నడుస్తున్నాయని, సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఒక వైపు నుంచి వాహనాలు వస్తే.. మరొక వైపు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రిటేయినింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై రిటేయినింగ్ వాల్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. పనుల్లో కొంత రిస్క్ ఉన్నందున, డిజైన్‌లో మార్పులు చేశాం. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించడంతో పనులను పూర్తి చేయలేకపోతున్నాం. దీనిపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, వారి సహకారంతో వారం రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, ఏఈ



చేవెళ్ల: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలంలోని కుమ్మెర, పలుగుట్ట గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున, ముడిమ్యాలలో రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు శుక్రవారం ఆయన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలకు పథకాలను అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ సభలను నిర్వహిస్తుందన్నారు. అక్కడ అర్హులైన లబ్ధిదారుల వివరాలను తెలియజేయటంతోపాటు దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. గ్రామీణ రోడ్లకు సైతం ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసిందని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, పాండుగౌడ్, ప్రభాకర్, వెంకటస్వామి, వీరేందర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, పెంటయ్యగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న ఏకైక మున్సిపాలిటీ శంకర్‌పల్లి మాత్రమేనని, దీని అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీల్లోని 15వార్డుల్లో రూ.14.70 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడి ఇప్పటికీ ఆరున్నర ఏళ్లు అవుతుందని, సుమారు రూ.100కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు ప్రకాశ్‌గుప్తా, ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మోహన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సమయపాలన పాటించాలి

కొందుర్గు: ఆర్టీసీ బస్సులు సమయానికి వచ్చేలా చూడాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాలకు సకాలంలో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు సమయానికి వెళ్లడం లేదన్నారు. కొందుర్గు నుంచి నవాబుపేట, కొందుర్గు నుంచి వయా గంగన్నగూడ, నవాబుపేట బస్సులు సమయానికి రాకపోవడంతో చిన్నారుల చదువుకు ఆటంకం కలుగుతుందని వాపోయారు. అధికారులు స్పందించి బస్సులు సమయానికి వచ్చేలా చూడాలని కోరారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశస్విని

మానవ అక్రమ రవాణా అడ్డుకోవాలి

శంకర్‌పల్లి: మానవ అక్రమ రవాణాని అడ్డుకోడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ చేవెళ్ల ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ యశస్విని కోరారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో కలిసి అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ బలరామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశస్విని మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా కారణంగా ఎంతో మంది ఆడపిల్లలు తమ జీవితాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్ వాడీ టీచర్లు గ్రామాల్లో మానవ అక్రమ రవాణాపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద గత 28 ఏళ్ల నుంచి మహిళల కోసం పోరాడుతుందని, ఇప్పటి వరకు 29,500 మందిని కాపాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సురేశ్ కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మిథాలీ రాజ్, సునీత, రేవతి, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లను మున్సిపాలిటీలో కలపొద్దు

- ఆందోళన చేపట్టిన గ్రామస్తులు
- ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

చేవెళ్ల: తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని మండలంలోని ఊరెళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగడంతోపాటు ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్‌లలో వినతిపత్రాలను అందజేశారు. చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్ల గ్రామాన్ని కలుపుతున్నట్లు ఇటీవల వచ్చిన సమాచారంతో గ్రామస్తులు నిరసనబాట పట్టారు. గ్రామస్తులంతా పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మున్సిపాలిటీలో గ్రామాన్ని కలపొద్దని వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఉపాధి కూలీ పనులపైనే దాదాపు 300ల మందికిపైగా కూలీలు జీవనం సాగిస్తున్నారని, అలాంటిది మున్సిపాలిటీలో కలిపితే ఉపాధి పనులు కోల్పోతామన్నారు. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవించే గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో కలిపే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఊరెళ్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యే తమ సమస్యపై స్పందించాలని కోరారు. అనంతరం ఆందోళనకు దిగిన గ్రామస్తులను పోలీసులు ఠాణాకు తరలించారు. సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డిలు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో ఊరెళ్ల గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు



ప్లాంటును ప్రారంభిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలోగల ప్రభుత్వ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు సహకారంతో ఆర్వో ప్లాంటు, కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని పరీక్షలలో మంచి మార్కులను సాధించాలన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ఐడీబీఐ బ్యాంకు యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, బ్యాంకు మేనేజర్ కవిత, సిబ్బంది ప్రియాంక, ప్రధానోపాధ్యాయుడు తుకారాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను పూర్తి చేయండి



షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్నలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. మున్సిపల్ నిధులతో గతంలో క్రిష్టియన్ కాలనీ(16వ వార్డు)లో సీసీ రోడ్లను వేసేందుకు టెండర్‌లను వేశారన్నారు. నేటికీ పనులను ప్రారంభించకుండా కాంట్రాక్టరు కాలయాపన చేశారన్నారు. వెంటనే అధికారులు సీసీ రోడ్లను పూర్తి చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్

షాద్‌నగర్: ప్రభుత్వం దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు జారీ చేయాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు జారీ చేయాలని గత పదేళ్లుగా దరఖాస్తులు చేసుకుంటున్నా ప్రభుత్వం జారీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం దివ్యాంగులను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న 24 కిలోల బియ్యం సరిపోవడం లేదని, దీన్ని 35 కిలోలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, గౌషియా బేగం, మనీల, లక్ష్మీబాయి, శ్రీదేవి, సుగుణ, యాదమ్మ, మాలమ్మ, చెన్నయ్య, గోపాల్, మురళీ, శివరాములు, మహేష్, రామస్వామి, రాములు, సాయిలు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

నిఘానీడలో గ్రామ సభలు

భూ రికార్డులను మార్చాలని ఫార్మాసిటీ భూ బాధితుల విజ్ఞప్తి

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలు పోలీసుల నిఘానీడలో జరిగాయి. ఫార్మాసిటీకి బలవంతంగా పట్టా భూములు తీసుకుని, రికార్డుల్లో టీజీఐఐసీ పేరు నమోదు చేయడం, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. గ్రామసభల్లో శాంతియుతంగా సమస్యలు చెప్పుకోండని, లేదంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని ముందస్తు హెచ్చరికలు జారీ కావడంతో.. భూ బాధితులు శాంతియుతంగా టీజీఐఐసీ పేరు మీద మార్చిన భూరికార్డులను తమ పేరిట మార్చాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

జాబితాలో అర్హుల పేర్లు చేర్చండి

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో అర్హులైన చాల మంది పేర్లు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లిస్టుల్లో లేవని పలు రాజకీయ పక్షాల నాయకులు అధికారుల దృష్టికి తెచ్చారు. నక్కర్తమేడిపల్లిలో అర్హులైన వారికి గ్రామ కంఠం భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అధికారులకు కోరారు. మొండిగౌరెల్లిలో చాలామంది కొత్త పథకాలకు అర్హులని, అర్హుల జాబితాలో వారి పేర్లను చేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో యాదగిరిరెడ్డి, నరేష్, సత్తయ్యలు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సభల్లో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తులో గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం సీఐలు కిష్టంరాజు, నర్సింహరావులు, ఎస్‌ఐలు, ఇబ్బంది పాల్గొన్నారు.



కుర్మిద్ద గ్రామసభ వద్ద పోలీసులు

కమ్మేసిన పొగమంచు

చేవెళ్ల/మొయినాబాద్/మొయినాబాద్‌రూరల్/షాబాద్: చలికాలం చివరి దశకు వస్తున్న సమయంలో చేవెళ్ల నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున పొగమంచు కప్పేసింది. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఉదయం రోడ్లపై ఎదురు వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో పొగమంచు కమ్మేసింది. వాహనదారులు, రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచులో సూర్యుడు మిణుకుమిణుకుమంటూ కనిపించాడు. రాత్రి పూట చల్లని చలికి తోడు ఉదయం పూట పొగమంచు, మధ్యాహ్నం విపరీతమైన ఎండతో వాతావరణంగా భిన్నంగా మారింది.



మొయినాబాద్: వెంకటాపూర్ వద్ద చెట్ల పొదలను కమ్మేసిన పొగమంచు



షాబాద్‌లో...



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ గ్రామాన్ని కమ్మేసిన మంచు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564